క్లుప్తంగా

ఎన్నారై విరాళం



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి కోసం కామారెడ్డి మండలం శాబ్దిపూర్ గ్రామానికి చెందిన ఎన్నారై నిమ్మ అంజల్ రెడ్డి రూ 1.10 లక్షల విరాళాన్ని అందజేశారు. ఆలయ రాజ గోపురంతో పాటు గర్భ గుడి షెడ్డు నిర్మాణం కోసం ఆయన విరాళాన్ని పంపించారు. ఆయన తరపున సోదరులు నిమ్మ విజయ్ కుమార్ రెడ్డి, శశికుమార్‌లు ఆలయ కమిటీ చైర్మన్ శనిగరం కమలాకర్ రెడ్డికి విరాళం మొత్తాన్ని అందజేశారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు



నిజాంసాగర్(జుక్కల్): బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.3 కోట్లు మంజూరు చేయడంతో పిప్పిరేగడి తాండ గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మహమ్మద్‌నగర్‌లో జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజును కలిసి సన్మానం చేశారు. హసన్‌పల్లి జీపీ పరిధిలోని పిప్పిరేగడి తండా బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే హన్మంత్‌సింధే, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి కృషి చేశారని గిరిజనులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, గున్కుల్ సోసైటీ చైర్మన్ వాజిద్ అలీ, హసన్‌పల్లి గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్‌గౌడ్ ఉన్నారు.

పాఠశాలలో వైద్య శిబిరం



రామారెడ్డి: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో మంగళవారం 185 విద్యార్థినులకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు చేసి 71 మంది పిల్లలకు రక్త పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ సురేశ్ తెలిపారు. అనంతరం వైద్యాధికారి సురేశ్ మాట్లాడుతూ దోమలు కుట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల సమయంలో సీజనల్ వ్యాధులు రాకుండా నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలకు పెట్టే భోజనం, కూరగాయలను పరిశీలించారు.

తహసీల్ కార్యాలయం తనిఖీ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయాన్ని మంగళవారం ఎల్లారెడ్డి ఆర్డీవో రమేశ్ రాథోడ్ తనిఖీ చేశారు. ఎల్లారెడ్డి ఆర్డీవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన మొదటిసారిగా మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. మండలంలోని గ్రామాలు, జనాభా, ఓటర్ల జాబితా గురించి ఆయన తెలుసుకున్నారు. అనంతరం పోచారం ప్రాజెక్టును సందర్శించారు. ఆయన వెంట తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ మస్రూర్, డిప్యూటీ తహసీల్దార్ రాందాస్, ఎంపీడీవో రఘు ఉన్నారు.

రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా ధర్నా



దోమకొండ: మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. రైతులకు 24 గంటల పాటు కేసీఆర్ విద్యుత్ అందిస్తున్నారని, రైతుబంధు, రైతుబీమా పేరుతో ఆదుకుంటున్నారని ఈ సందర్భంగా నాయకులు అన్నారు. రైతులకు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జిల్లా డైరెక్టర్ శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ ఫిరంగి రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

మణిపూర్ ఘటనలకు ప్రభుత్వాలే కారణం



కామారెడ్డి అర్బన్: మణిపూర్‌లో జరుగుతున్న అత్యాచారాలను వ్యతిరేకిస్తూ డీటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం కామారెడ్డి మున్సిపల్ ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. మణిపూర్ హింసాత్మకంగా మారడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌సీ ప్రభాకర్, దేవులా ఆరోపించారు. అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల బాబు, నేతలు క్యాతం సిద్ధిరాములు, ముదాం అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతన్నపై కూలీ భారం

- నిత్యం వర్షాలతో జోరందుకున్న వ్యవసాయ పనులు
- ఎకరం పొలం వరి నాటుకు కూలీలకు రూ. 12 వేల వరకు ఖర్చు
- మహిళా కూలీలకు రోజుకు రూ.500 చెల్లింపు
- ఖర్చు తడిసి మోపెడవుతున్న వైనం



జనగామలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

బీబీపేట: చారాణా కోడికి బారాన మసాలా అన్నట్లుగా తయారైంది రైతుల పరిస్థితి. వ్యవసాయం చేయాలంటే రైతులు భయపడేలా అన్నిరకాల రేట్లు పెరుగుతున్నాయి. కూలీల రేట్లతో పాటు ట్రాక్టర్, ఎరువులు, మందుల ఖర్చులు ఇలా రైతులపై పెను భారంగా మారాయి. రైతులు రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడ్డా పంట చేతికి వచ్చే వరకు నమ్మకం లేదు. పనులకు కూలీల రేట్లు ఈ ఏడాది అధికంగా పెరగడంతో తట్టుకోలేక పోతున్నారు.

కూలీల రేట్లు..

ఒక ఎకరం పొలం నాటు వేయాలంటే గతంలో రూ.3 వేల వరకు కూలీలకు ఖర్చయ్యేది. కానీ ప్రస్తుతం సుమారు రూ. 6 వేల నుంచి 7 వేల వరకు అవుతోంది. ఎకరం పొలానికి నాటు వేయడానికి గుత్తాగా రూ.6 వేలకు పైనే అడుగుతున్నారు. అంతే కాకుండా నారు పంచడానికి, గెట్లు వేయడానికి మగవారికి రోజుకు కూలీ రూ.700 నుంచి రూ.900 వరకు చెల్లించాల్సి వస్తోంది. అలాగే మహిళా కూలీలకు రూ.400 నుంచి రూ. 500 వరకు చెల్లించాల్సి వస్తోంది. ఇంత పెట్టుబడి పెట్టడం రైతులకు ఇబ్బందిగా మారింది. అంతే కాకుండా గతంలో పొలం ఎంత దూరం ఉన్నప్పటికీ నడుచుకుంటూ వెళ్లి తిరిగి వచ్చేవారు. కానీ ప్రస్తుతం ఎంత దూరం అయినా సరే ఖచ్చితంగా ఆటోలు ఏర్పాటు చేస్తేనే కూలీ పనులకు వస్తామని నిబంధన పెడుతున్నారు. దీంతో చేసేదేమి లేక వాహనం ఏర్పాటు చేయడంతో అదనంగా మరో ఖర్చు రైతుపై పడుతోంది. ఒక ఎకరం పొలం నాటు వేయాలంటే కేవలం కూలీలకే సుమారు రూ. 12 వేల వరకు ఖర్చు అవుతుంది. పత్తి, మొక్కజొన్న తదితర పంటల్లో కలుపు తీయడానికి సైతం కూలీల రేట్లు అమాంతంగా పెరిగాయి.

యంత్రాల కిరాయిలు..

ప్రస్తుతం దుక్కి దున్నిన నాటి నుంచి పంట చేతికి వచ్చే వరకు రైతులు పూర్తిగా యంత్రాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఒక ఎకరం దుక్కి దున్నడానికి రూ.800, బురదలో దున్నడానికి రూ. 1200 అవుతుంది. ఎకరంలో వరి నాటు వేయాలంటే సుమారు రూ.5 వేల వరకు ట్రాక్టర్‌కు చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

ధరలతో ఇబ్బందిగా ఉంది



కూలీల రేట్లను అమాంతం పెంచడంతో వ్యవసాయం చేయాలంటేనే భయమేస్తోంది. ప్రతి పనికి గుత్తాగా మాట్లాడుకుంటూ వ్యవసాయాన్ని ఖర్చుల పాలు చేస్తున్నారు. వర్షాకాలం కాబట్టి కాస్త ఎక్కువగానే వ్యవసాయం చేసుకుంటాం. కూలీల ధరలు చూసి చేయలేకపోతున్నాం. – సిద్ధరాంరెడ్డి, రైతు, జనగామ

రైతులకు కష్టంగా మారింది



దేశానికే అన్నం రైతన్నలు నేడు ఖర్చుల బారిన పడి వ్యవసాయం చేయలేకపోతున్నారు. వ్యవసాయానికి కూలీల ధరలే కాకుండా యంత్రాలు, ఎరువులు, మందులు తదితర ఖర్చులతో పెట్టుబడి ఎక్కువగా అవుతుంది. కూలీల ధరలు పెరగడం వల్ల అదనపు భారం పడుతోంది. – నర్సింలు, రైతు, యాదారం

గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన



బిచ్కుంద: మాట్లాడుతున్న కేంద్ర అధికారులు



పోతంగల్ కలాన్ జీపీలో రికార్డులు పరిశీలిస్తూ..

బిచ్కుంద(జుక్కల్): గ్రామాలలో నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించడానికి కేంద్రం బృందం అధికారులు మంగళవారం గ్రామాలలో పర్యటించారు. మండలంలోని హజ్గుల్, గుండెనెమ్లి, సీతారాంపల్లిలో లబ్ధిదారుల ఇంటికి, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి మరుగుదొడ్లు పరిశీలించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ పథకం కింద మండలంలో ఎన్ని మరుగుదొడ్లు నిర్మించారు.. ఎంత మంది వాడుతున్నారని డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీవో మహిబూబ్‌ను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర అధికారులు ఫయాజ్, రాకేష్, ఎంపీడీవో ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

పోతంగల్ కలాన్ జీపీ తనిఖీ..

గాంధారి(ఎల్లారెడ్డి): పోతంగల్ కలాన్ జీపీని మంగళవారం కేంద్ర బృందం సభ్యులు పరిశీలించినట్లు ఎంపీడీవో సతీష్ తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్(ఎస్‌బీఎం) పథకంలో భాగంగా జరిగిన పనులను వారు పరిశీలించారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఎంపీవో రాజ్ కిరణ్, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను కేటాయించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్ ప్రాథమిక పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించాలని కోరుతూ మంగళవారం ధర్మారావ్‌పేట్ ఎంపీటీసీ నాయని మహిపాల్ యాదవ్, డీఈవో రాజుకు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు.

పారిశుధ్య పనుల్లో ప్రజాప్రతినిధులు



బీబీపేట: మండల కేంద్రంలో పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం వహించారని జిల్లా అదనపు కలెక్టర్ మను చౌదరి పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ చేయడంతో ఉపసర్పంచ్ సాయినాథ్, కార్యదర్శి ఇంతియాజుద్దీన్, సర్పంచ్ భర్త సత్యనారాయణలు కలిసి మంగళవారం గ్రామ పారిశుధ్య పనుల్లో నిమగ్నమయ్యారు. కూలీల సహాయంతో ట్రాక్టర్, జేసీబీలు పెట్టి చెత్తను పూర్తిగా తీసి డంపింగ్‌యార్డుకు తరలించారు.

వీడీసీపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న పాలకవర్గం సభ్యులు

భిక్కనూరు: కాచాపూర్‌లో కొందరు వీడీసీ పేరిట ప్రజలను ఇబ్బందులు కలగజేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ సర్పంచ్ తొగరి సులోచన ఆధ్వర్యంలో జీపీ పాలకవర్గ సభ్యులు భిక్కనూరు ఎస్సై ఆనంద్ గౌడ్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆర్‌వో వాటర్ ప్లాంట్‌కు వస్తున్న ఆదాయాన్ని వారే తీసుకుంటున్నారని, గ్రామంలో మొరం తవ్వకాలను ప్రోత్సహిస్తున్నారని, జీపీ పాలకవర్గంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే వీడీసీ పేరిట చలామణవుతున్న వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. అలాగే కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ సులోచన తెలిపారు. ఉప సర్పంచ్ సిద్ధగౌడ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల కోసం స్థల పరిశీలన

మద్నూర్(జుక్కల్): డిగ్రీ కళాశాల కోసం స్థలాన్ని మంగళవారం సర్పంచ్ సురేశ్ పరిశీలించారు. ప్రస్తుతం డిగ్రీ కళాశాల తరగతులు కొనసాగడానికి జూనియర్ కళాశాలలో గదులను పరిశీలించారు. ప్రిన్సిపాల్‌తో మాట్లాడి డిగ్రీ తరగతులు కొనసాగించడానికి గదులు కేటాయించాలని కోరారు. అడ్మిషన్లు కొనసాగుతున్నాయని, త్వరలోనే టీచింగ్ స్టాఫ్ వస్తుందన్నారు. కళాశాల నిర్వహణకు జీపీ నుంచి అన్ని వసతులు కల్పిస్తామని సర్పంచ్ తెలిపారు.

కార్మికుల హక్కులను కాలరాస్తోన్న ప్రభుత్వం



బీర్కూర్‌లో మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

బాన్సువాడ: ప్రభుత్వం పంచాయతీ పారిశుధ్య కార్మికుల హక్కులను కాలరాస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ ఆరోపించారు. బీర్కూర్‌లో కొనసాగుతున్న కార్మికుల సమ్మె శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. నాయకులు బోయిన శంకర్, దొంతురాం కాశీరాం, సానేపు గంగారం, తదితరులు ఉన్నారు.

సంక్షిప్తం

నాగిరెడ్డిపేట ఎస్సై బదిలీ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట ఎస్సై ఆంజనేయులు బదిలీపై రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కోనారావుపేటకు బదిలీ అయ్యారు. ఆంజనేయులు రెండున్నరేళ్లపాటు విధులు నిర్వహించారు. ఎన్నికల బదిలీలలో భాగంగా ఆయనను బదిలీ చేశారు. ఏఎస్సై లచ్చిరాంనాయక్‌కు నాగిరెడ్డిపేట బాధ్యతలు అప్పగించారు.

92వ రోజుకు చేరుకున్న నిరసన దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ విడుదల చేసే వ్యర్థాల నుంచి తమ గ్రామాన్ని కాపాడాలంటూ వీడీసీ ఆధ్వర్యంలో కాచాపూర్ గ్రామంలో మంగళవారం చేపట్టిన నిరసన దీక్షలు 92వ రోజుకు చేరుకున్నాయి. వెంటనే చర్యలు తీసుకోకపోతే ఫ్యాక్టరీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రజాపతి తెలిపారు. రైతు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను జత చేసి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

సీఎం, స్పీకర్ చిత్రపటాలకు పాలాభిషేకం

బాన్సువాడ రూరల్: వీఆర్ఏలకు పేస్కేల్ వర్తింపజేస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో విడుదల చేయడాన్ని హర్షిస్తూ మంగళవారం ఇబ్రహీంపేట్, బోర్లం తదితర గ్రామాల్లో వీఆర్ఏలు గ్రామస్తులతో కలిసి సంబురాలు చేసుకున్నారు. సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం, కేటీఆర్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. బాణాసంచ కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు మాలెపు నారాయణరెడ్డి, సరళ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ శ్రావణీ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మొక్కలు నాటడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని సర్పంచ్ చెంద్రవ్వ అన్నారు. మంగళవారం బూరుగుపల్లిలో హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటికో మొక్క నాటి సంరక్షించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ పంపిణీ

బాన్సువాడ రూరల్: బోర్లం, తాడ్కోల్, ఇబ్రహీంపేట్ తదితర గ్రామాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. విద్యార్థుల్లో ఐరన్ లోపం లేకుండా ఉండటానికి ప్రభుత్వం రాగిజావ పంపిణీ కార్యక్రమం ప్రారంభించిందని ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం

కామారెడ్డి టౌన్: జిల్లాలోని ఐదు మండలాల బీజేపీ అధ్యక్షులను జిల్లా అధ్యక్షురాలు అరుణతార మంగళవారం ప్రకటించారు. నస్రుల్లాబాద్ మండల అధ్యక్షుడిగా సున్నం సాయిలు, బీర్కూర్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, బాన్సువాడ రూరల్ అధ్యక్షుడిగా వడ్ల శేఖర్, నిజాంసాగర్ మండల అధ్యక్షుడిగా నరేష్, పెద్ద కొడప్‌గల్ అధ్యక్షుడిగా బాలాజీ పటేల్‌లను నియమించారు.

అన్నపూర్ణదేవి అమ్మవారికి మన సారె ఉత్సవం

కామారెడ్డి అర్బన్: శ్రీశైవ క్షేత్ర వనితా శక్తి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కామారెడ్డి విద్యానగర్ విశ్వనాథేశ్వర స్వామి ఆలయంలో అన్నపూర్ణదేవి అమ్మవారికి సారె ఉత్సవం నిర్వహించారు. శ్రీశైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి పిలుపు మేరకు 'మనసారా...అమ్మకు మన సారె 'కార్యక్రమాన్ని కాలనీకి చెందిన మహిళలు భక్తి శ్రద్ధలతో చేశారు.

ఓటరు జాబితా సక్రమంగా ఉండేలా చూడాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఓటర్ జాబితా సక్రమంగా ఉండేలా బూత్ అధికారులు జాగ్రత్త వహించాలని జుక్కల్ నియోజకవర్గ ఎన్నికల మాస్టర్ ట్రైనర్ నవీన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎన్నికల బూత్ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కొత్తవారి ఓటు హక్కు కల్పించి, మరణించిన వారిని ఓటర్ జాబితా నుంచి తొలగించాలని సూచించారు. తహసీల్దార్ దశరథ్, ఆర్ఐ అంజయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): వాహనాలు నడిపే వ్యక్తులు ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని ఏఎస్సై వెంకట్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. పలువురికి జరిమానాలు విధించారు. ఆయన వెంట అంజి, రమేష్ ఉన్నారు.

చిత్రకళలో ప్రపంచ రికార్డు

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి విద్యుత్‌నగర్‌కు చెందిన నంగునూరి భానుతేజ చిత్రకళ విభాగంలో 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సాధించారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భానుతేజ పాల్గొని సినిమా నటుడు పవన్ కల్యాణ్ చిత్రాన్ని బొగ్గుతో వేసి గుర్తింపు పొందాడు. ప్రపంచ రికార్డులు నమోదు చేసే సంస్థ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, స్వర్ణపతకం, ప్రశంసా పత్రం, గుర్తింపు కార్డులు భానుతేజకు అందజేసింది. ఈ సందర్భంగా భాను తేజను పలువురు అభినందించారు.

డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె ఆగదు



బీబీపేటలో ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు



భిక్కనూరులో డీపీవోతో మాట్లాడుతున్న కార్మికులు

రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి 20 వ రోజుకు చేరింది. కనీవేతనం, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, మల్టీపర్పస్ విధానం రద్దు తదితర డిమాండ్లు నెరవేర్చేవరకు సమ్మె కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు. ప్రయివేటు వ్యక్తులను పెట్టి పారిశుధ్య పనులు చేయిస్తున్నారని, వారిని పెట్టొద్దని కోరుతూ కార్మికులు పలు చోట్ల ధర్నాలు నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ధర్నాలు చేస్తుంటే ఉన్నతాధికారులు ఒత్తిడికి గురి చేస్తున్నారని వారు వాపోయారు. పలు పార్టీల నేతలు సంఘీభావం తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్

కారోబార్లను సహాయ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలి



నస్రుల్లాబాద్(బాన్సువాడ): గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కారోబార్లు, బిల్ కలెక్టర్‌లను సహాయ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని గ్రామ పంచాయతీ సిబ్బంది డిమాండ్ చేశారు. మంగళవారం బొమ్మన్‌దేవ్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద జీపీ సిబ్బంది సమ్మె చేశారు. పంచాయతి సిబ్బంది రతన్, గంగారాం, భాషయ్య, కామయ్య, సాయిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువు



విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న పీసీసీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయని పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్యాణి గ్రామ ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. మన ఊరు-మన బడి పథకం కింద ఇంత వరకు పాఠశాలలో చేపట్టిన పనులు పూర్తి కాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తరగతి గదులలో వర్షం నీరు ఊరుస్తుండటం, సరిపడా మూత్ర శాలలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నేతలు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

జీపీ కార్మికుల సమ్మెకు మద్దతు

ఎల్లారెడ్డి: జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పీసీసీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఎల్లారెడ్డిలోని తెలంగాణ తల్లి ప్రాంగణంలో నిర్వహిస్తున్న జీపీ కార్మికుల సమ్మెకు ఆయన మద్దతు పలికారు. 20 రోజులుగా జీపీ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



పిట్లం: కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీవో బ్రహ్మం



దోమకొండలో.. ఎంపీడీవో చిన్నారెడ్డి

పిట్లం/దోమకొండ/రాజంపేట/నాగిరెడ్డి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా చర్యలు చేపట్టాలని పిట్లం మండల పంచాయతీ అధికారి బ్రహ్మం, దోమకొండ ఎంపీడీవో చిన్నారెడ్డి, రాజంపేటల ఎంపీడీవో బాలకిషన్, నాగిరెడ్డిపేట ఎంపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. వారు ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో మంగళవారం జీపీ కార్యదర్శులతో, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎప్పటికప్పుడు రోడ్లు, మురికి కాలువలు శుభ్రపరచాలని, డ్రికింగ్ వాటర్ క్లోరినేషన్ ప్రతి రోజు చేయాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



బాన్సువాడలో స్పీకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష విభాగం ఉద్యోగులు



బిచ్కుందలో ఎమ్మెల్యే హన్మంత్ సింధేకు..

బాన్సువాడ : తమకు కనీస వేతనాలు అమలు చేసే విధంగా కృషి చేయాలని మంగళవారం బాన్సువాడలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సమగ్ర శిక్ష విభాగం ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష విభాగం ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి భాను మాట్లాడుతూ.. 12 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నామని, జిల్లా కమిటీల ద్వారా రోస్టర్, మెరిట్ ద్వారా నియమించారని, కనీస వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు.

ఎమ్మెల్యే హన్మంత్ సింధేకు..

బిచ్కుంద(జుక్కల్): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సమగ్ర శిక్ష విభాగం ఉద్యోగులు బిచ్కుందలో ఎమ్మెల్యే హన్మంత్ సింధేకు వినతి పత్రం అందించారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని వారు కోరారు. మా సమస్యలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు.

కుల సంఘ భవనాలకు ప్రొసీడింగ్ కాపీల అందజేత



రామారెడ్డి: మండలంలో రెడ్డిపేట స్కూల్ తండా, జగదాంబ తండా గ్రామాల్లో కుల సంఘ భవనాలకు సంబంధించి ప్రొసీడింగ్ కాపీలను కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అందజేశారు. రెడ్డిపేట ముదిరాజ్ సంఘం భవనానికి రూ.5 లక్షలు, ఎస్సీ మాదిగ సంఘానికి రూ.4 లక్షలు, ఎస్సీ మాల సంఘానికి రూ.4 లక్షలు, కుమ్మరి సంఘానికి రూ.3 లక్షలు, యాదవ సంఘానికి రూ.4 లక్షలు, విశ్వబ్రాహ్మణ సంఘానికి రూ.3 లక్షలు, స్కూల్ తండా(ఎస్టీలకు) భవనానికి రూ.4లక్షలు, జగదాంబ తండా(ఎస్టీలకు) భవనానికి రూ.3 లక్షలు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్‌లను అందజేశారు. రామారెడ్డి ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ రాజగౌడ్, సర్పంచ్ రాజునాయక్, కుల సంఘం నేతలున్నారు.